క్లుప్తంగా

పెడన మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖరరెడ్డి



పెడన: మున్సిపల్ కమిషనర్‌గా ఎల్. చంద్రశేఖరరెడ్డి బుధవారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఎం.గోపాలరావు మచిలీపట్నం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తూ పెడన బాధ్యతలను చంద్రశేఖరరెడ్డికి అప్పగించారు. చంద్రశేఖర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వ విధుల్లో చేరి అనంతరం నెల్లూరు జిల్లాలో పంచాయతీలు పట్టణంలో విలీనం అయిన సందర్భంగా మున్సిపల్ విభాగానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అనంతరం సూపరింటెండెంట్‌గా, కమిషనర్‌గా సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేట, చీమకుర్తిలో పనిచేశారు. బుచ్చిరెడ్డిపాలెంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. తొలుత ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌కు కార్యాలయ సిబ్బంది పలువురు అభినందనలు తెలియజేశారు.

ఎంపీవోగా జెన్నీ



పెడన: మండలం వ్యవసాయశాఖ అధికారిణిగా సజ్జా జెన్నీని నియమిస్తూ వ్యవశాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె రంపచోడవరం డివిజన్‌లోని దేవీపట్నం ఎంఏవోగా విధులు నిర్వహిస్తూ డెప్యూటేషన్‌పై కృత్తివెన్ను మండలంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయశాఖ నిర్వహించిన బదిలీల ప్రక్రియలో భాగంగా ఈమెను పెడన ఎంఏవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న నూరున్నీసాను గతంలో ఆమె పనిచేసిన మచిలీపట్నం సాయిల్‌టెస్ట్ ఆగ్రి ల్యాబ్‌లో ఏవోగా నియమించారు. జెన్నీ రెండు, మూడు రోజుల్లో పెడన ఎంఏవోగా బాధ్యతలను స్వీకరించనున్నట్లు సమాచారం.

దేవాలయాల ఈఓల బదిలీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని దేవదాయశాఖ పరిధిలోని పలు దేవాలయాలకు ఈఓలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. మంటాడలోని శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓగా పని చేస్తున్న ఆర్.మాధవీలత నగరంలోని ఖొజ్జిల్లిపేటలో వేంచేసిఉన్న శ్రీ నాగేశ్వరస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. ఇక్కడ ప్రస్తుతం వై.శిరీష ఇన్‌చార్జ్ ఈఓగా పని చేస్తున్నారు. బచ్చుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓగా పని చేస్తున్న ఎస్.ఆంజనేయ స్వామి నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆయల ఈఓగా బదిలీ అయ్యారు. విజయవాడలో పని చేస్తున్న జీవీ కృష్ణారావు బచ్చుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓగా బదిలీ అయ్యారు. వీరంతా త్వరలోనే ఆయా ఆలయాల్లో ఈఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు.


కానిస్టేబుల్‌పై దాడి కేసులో 8 మంది అరెస్ట్

పెడన: కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటనలో ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు పెడన పోలీసులు తెలిపారు. గుడ్లవల్లేరు పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజులపాటి వీరబాబు తన బంధువులతో కలిసి ట్రాక్టరుపై ఈ నెల 8న మచిలీపట్నం మండలం బీచ్ రోడ్డులో వాకాలమ్మ సంబరాలకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పెడన- బంటుమిల్లి రోడ్డులోని చూజీ కంపెనీ వద్ద గుర్తు తెలియని కొందరు ట్రాక్టరును ఆపి గొడవకు దిగారు. కానిస్టేబుల్ వీరబాబు, అతని బావ నాగరాజులపై ఆ యువకులు దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనపై స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి 8 మందిని గుర్తించి అరెస్ట్ చేశారు. వీరిలో కోడూరు భార్గవ్, చిన్నం వెంకన్నబాబు, బొర్రా కిరణ్, అలమూరి శివనాగకుమార్‌లను మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. బొర్రా ప్రవీణ్, చిన్నం రాహుల్, జంగం రాహుల్, కోడూరు నిఖిల్‌లను బుధవారం అరెస్ట్ చేశారు. గురువారం కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

మెప్మా టీఎంసీగా ఆనందబాబు

పెడన: పురపాలక సంఘ పరిధిలోని మెప్మా విభాగంలో టీఎంసీ భోగేశ్వరరావు మచిలీపట్నం కార్పొరేషన్‌కు బదిలీ ఆయ్యారు. ఈయన స్థానంలో మచిలీపట్నం నుంచి కేవీఎస్ ఆనందబాబు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆనందబాబు బాధ్యతలను స్వీకరించారు.

వరి విత్తనాల లోడు లారీ బోల్తా



పెడన: మండలంలోని రైతు సేవా కేంద్రాలకు వరి విత్తనాలను తీసుకువెళ్తున్న లారీ బుధవారం సాయంత్రం బోల్తా పడింది. సేకరించిన, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని చెన్నూరు గ్రామం నుంచి తాళ్లచెరువు మీదుగా ఉరివి గ్రామానికి వరివిత్తనాల లోడుతో లారీ బయల్దేరింది. తాళ్లచెరువు వద్ద రోడ్డు మార్జిలోకి దిగడంతో పక్కకు ఒరిగిపోయింది. పక్కనే పంట బోదె ఉండటంతో ఆ బోదెలోని నీటిలో వరి విత్తనాల బస్తాలు పడిపోయాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఇటు వ్యవసాయశాఖ అధికారులు అటు పోలీసువారిని సంప్రదించగా మాకు సమాచారం లేదని తెలియజేయడం విశేషం.

సాగునీరు.. విత్తనాలు ఇవ్వకుండానే ఏరువాక

- అరిసేపల్లిలో ఏరువాక నిర్వహించిన కూటమి నేతలు, అధికారులు
- గత ప్రభుత్వ హయాంలో ఏరువాకకు ముందే సాగునీరు.. విత్తనాలు సరఫరా
- ఇదేం తీరు అని విమర్శిస్తున్న రైతులు



అరిసేపల్లిలో ఏరువాక కార్యక్రమంలో కాడెద్దులకు పూజలు

మచిలీపట్నంటౌన్: కూటమి పాలనలో అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ ఖరీఫ్ సాగుకు సైతం మొండి చేయి చూపటం విమర్శలకు తావిస్తోంది. జేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఖరీఫ్ సాగుకు స్వాగతం పలుకుతూ ఏరువాక కార్యక్రమాన్ని ప్రతి యేడాదీ నిర్వహించటం ఆనవాయితీ. ఈ సందర్భంగా వ్యవసాయానికి అవసరమైన ఎడ్లు, నాగలి, ఇతర పనిముట్లను పసుపు, కుంకుమ, పూలతో పూజిస్తారు. ఎడ్లను, నాగలిని ప్రత్యేకంగా రంగు రంగుల కాగితాలతో అలంకరిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఓ పండుగలా నిర్వహించటం ఆచారం.

గతంలో వైఎస్సార్ సీపీ పాలనలో..

ఏరువాక కార్యక్రమానికి ముందే గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జూన్ 10వ తేదీన సాగునీటిని విడుదల చేయటం, రైతు భరోసా కేంద్రాల ద్వారా వరి సాగుకు అవసరమైన విత్తనాలను రైతులకు అందించేవారు. దీంతో రైతులంతా సకాలంలో ఖరీఫ్ సాగుకు సమాయత్తం అయ్యేవారు.

కాలువలు బాగుచేయకుండానే..

కూటమి పాలకులు ఇప్పటి వరకూ నియోజకవర్గంలోని పంట కాలువలు, డ్రెయిన్‌లలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన తూడుకాడ, గుర్రపుడెక్కను సైతం తొలగించలేదు. పలు ప్రాంతాల్లో పంటకాలువల మరమ్మతు పనులు కూడా ప్రారంభమే కాలేదు. ఈ యేడాది ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యేలా ఉందని.. అదును పోతే సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది ఇదే తీరుతో నష్టం

గత యేడాది కూడా సకాలంలో సాగు జరక్క పోవటంతో దిగుబడులు తగ్గటంతో పాటు పెట్టుబడి పెరిగిందని, పండించిన పంటకు గిట్టుబాటు ధరరాక ఇంకా ధాన్యం కుప్పల్లోనే ఉంచామని, కోత దశలో అకాల వర్షాలు కురవటంతో వడ్లు పాయ రావటంతో రేటు పడిపోయి సాగు ఖర్చులు రాక అప్పులు పాలయ్యామని, ఈ యేడాది కూడా అదే విధంగా జరిగితే తాము కోలుకోని దెబ్బను ఎదుర్కోవాల్సివస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వనరులు సమకూర్చకుండానే ఏరువాక ప్రారంభం

అయితే ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు అవసరమైన సాగునీటిని విడుదల చేయకుండానే.. విత్తనాలను రైతులకు అందజేయకుండానే జేష్ఠ శుద్ధ పౌర్ణమి ఏరువాక కార్యక్రమాన్ని బుధవారం మండల పరిధిలోని అరిసేపల్లి వ్యవసాయ క్షేత్రం వద్ద వ్యవసాయ శాఖ అధికారులు, నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆడంబరంగా ఏరువాక పూజలు నిర్వహించారు. అయితే జేష్ఠ శుద్ధ పౌర్ణమి నాటికి కూటమి పాలకులు కాలువల ద్వారా సాగునీటిని ఇవ్వకుండా, విత్తనాలు అందజేయకుండానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించటాన్ని నియోజకవర్గంలో రైతాంగం విమర్శిస్తోంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన అనంతరం వాటర్ ఫౌంటెన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: పట్టణంలోని ఒకటో వార్డులో రూ.8.80 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, 14వ వార్డులో రూ.5.16 లక్షలతో ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి పనులను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్‌ఖయ్యూం, మోహనరావు, వాహెబ్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, ఏఈ సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలో..

మండల పరిధిలోని బల్లిపర్రు కాలనీలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.21.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. బల్లిపర్రులో పాత బల్లిపర్రుకు వెళ్లే మార్గంలో రూ.29 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి శంకుస్థాపన చేశారు. జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, కార్యదర్శి శీరం ప్రసాద్, ఎంపీడీవో అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంలో ఒకలా..నిర్మాణంలో మరోలా..

బల్లిపర్రులోని పాతబల్లిపర్రు గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు 60 మీటర్లు పొడవు తగ్గిందని, అంచనాలు, శిలాఫలకంలో ఒక విధంగా, రోడ్డు నిర్మాణంలో మరో విధంగా పొడవు ఉందని పేర్కొంటున్నారు. రోడ్డును తగ్గించి నిర్మాణం చేపట్టడం ఎంత వరకు సమంజమని ప్రశ్నిస్తున్నారు.

మోపిదేవి: మండలంలోని మోపిదేవివార్పు వద్ద ఇరిగేషన్‌శాఖ చేపట్టిన పనులకు శిలాఫలకాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం కె.కొత్తపాలెం గ్రామంలో 15 సీసీ రోడ్లను ప్రారంభించారు. ఆపరేషన్ మెయింటెనెన్స్ నిధులు రూ.3.20 కోట్లతో చేపట్టిన 93 పనులకు, రాష్ట్ర డిజాస్టర్ మిటిగేషన్ నిధులు రూ.5.63 కోట్లతో చేపట్టిన 18 పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. అంతకుముందు డెల్టా రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్, నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి అధికారి సాయిబాబు, ప్రాజెక్టు చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరావు, ఘంటసాల మార్కెట్‌కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీపీ రావి దుర్గావాణి, తహసీల్దార్ శ్రీవిద్య, ఎంపీడీవో స్వర్ణభారతి, మత్తి నాగమల్లేశ్వరావు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కోడూరు: మండలంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం శ్రీకారం చుట్టారు. ఉల్లిపాలెంలో లింగన్నకోడు మేజర్ డ్రెయిన్‌పై పీఎంజీఎస్‌వై నిధులు రూ.2.80 కోట్లతో వంతెన నిర్మాణానికి బుద్ధ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఉల్లిపాలెం- సాలెంపాలెం వరకు వేణుగోపాలపురం గ్రామాన్ని కలుపుతూ రూ.3.70 కోట్లతో 4.1 కి.మీ మేర నూతనంగా నిర్మించిన రహదారిని ప్రారంభించారు. పల్లె పండుగను పురస్కరించుకుని ఉపాధి హామీ పథకం నిధులు రూ.98.70 లక్షలతో 1563 మీటర్ల మేర నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ శాఖలాధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో గురువారం విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ ఎ.గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. నగరంలోని గొడుగుపేట, చెమ్మనగిరిపేట, రుస్తుంబాద, రాజా గారి సెంటర్, ఈడేపల్లి బస్టాండ్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మూడు గంటల పాటు బందరుకోట, వైఎస్సార్ కాలనీ, గిలకలదిండి, గరాలదిబ్బ, మల్కాపట్నం, జగన్నాధపురం, రైలుపేట, బుట్టాయిపేట, అరవగూడెం, రాబర్ట్‌సన్ పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తెగిపడిన విద్యుత్ తీగ

కాసానగర్(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు శివారు కాసానగర్, కె.కొత్తపాలెం గ్రామాల్లో విద్యుత్ పోల్స్ నుంచి ఆర్టీసీ ఫీడర్ జంపర్ బుధవారం వీచిన గాలులకు తెగిపడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారి పక్కనే జంపర్ కిందపడి పోవడంతో వెంటనే స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు జంపర్‌లు పునర్నిర్మించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఎలాంటి ప్రమాదం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించడంతో గ్రామస్తులు ఆశాఖ అధికారులను అభినందించారు.

ఆక్వా ల్యాబ్ నిర్మాణం

కృత్తివెన్ను: మండల పరిధిలోని ఒంటిళ్ల గ్రామం వద్ద ఆక్వాల్యాబ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.50 లక్షల అంచనాలతో ల్యాబ్ నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో నాగాంజని ఉన్నారు. బంటుమిల్లి మండలంలో ముంజులూరులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. సాతులూరు నుంచి కొర్లపాడు వరకు రూ.9 లక్షల అంచనాలతో డ్రెయిన్ తవ్వకం పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

15న నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో 15వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ విద్యా నికేతన్ డిజటల్ స్కూలు ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. సంబంధిత రోగులు నేత్ర వైద్య పరీక్షలు, ఇతర వివరాల కోసం మొబైల్ నంబర్లు 94906 36466, 70936 17778లలో సంప్రదించి పేర్లు ముందుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వైద్య పరీక్షల్లో రోగులకు శుక్లాలు నిర్ధారణ అయితే, అలాంటి వారందరికీ కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్(ఐఓఎల్ శస్త్రచికిత్స)లను శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

కనుల పండువగా వెంకన్న శాంతి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు, ఉభయదాతలు

కోడూరు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివార్ల శాంతి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోర్చణల నడుమ ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. ప్రత్యేక అలంకరించిన కల్యాణవేదికపై శాంతి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. రాత్రికి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ కార్యక్రమాలను జరిపారు. గురువారం ఆలయం వద్ద మహా అన్నసమారాధనను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ చెప్పారు. కోడూరుకు చెందిన శ్రీవెంకటేశ్వర, శ్రీనివాస భక్తమండళ్లకు చెందిన మహిళలు నిర్వహించిన కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో మురళీకోలాటం చేశారు. కోలాట భజనలకు అనుగుణంగా నృత్యాలు చేసి సందడి చేశారు. యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేటకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జరుగువానిపాలెంకు చెందిన భక్తులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

ఖరీఫ్ సాగుకు విత్తనాలు సిద్ధం



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఖరీఫ్ సాగుకు వరి విత్తనాలు గ్రామ సచివాలయాల్లో సిద్ధంగా ఉన్నాయని ఎంఏవో హెప్సిబారాణి తెలిపారు. మండల పరిధిలోని ఉత్తరచిరువోలులంకలో కేవీకే ఘంటసాల వ్యవసాయ శాస్త్రవేత్తలు వికసిత్ కృషి విజ్ఞాన అభియాన్ కార్యక్రమం గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరిస్తూ పలురకాల వరి విత్తనాలు బీపీటీ 5204, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 రకాలు గ్రామ సచివాలయల్లో సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బీపీటీ 25 కిలోల బ్యాగు రూ.1,075 కాగా సబ్సిడీ రూ.125 పోను రైతు రూ.950 చెల్లించాలన్నారు. ఎంటీయూ 1061 రకం బ్యాగు 30 కిలోలు రూ.1,260 సబ్సిడీ రూ.150 పోను రైతు రూ.1,110 చెల్లించాలన్నారు. కేవీకే సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, డాక్టర్ కె.లహరి, డాక్టర్ బి.బాబు, విలేజ్ అగ్రకల్చర్ అసిస్టెంట్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు.

వర్షాలకు రోడ్లపై కూలిన చెట్లు



కొడాలి- విజయవాడ రోడ్డుపై పడిన చెట్లను తొలగిస్తున్న కార్మికులు

ఘంటసాల: ఘంటసాలలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి ఘంటసాల- రామానగరం రహదారి పాత పోలీస్ స్టేషన్ వద్ద నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ మోకాళ్లలోతు నీరు బయటకు పోయే మార్గం లేక రోడ్డు గుంతలమయంగా మారిపోతుంది. శ్రీకాకుళంలోని ఏకరాతి ప్రసన్న మల్లికార్జున స్వామి దేవాలయం వర్షాలకు జలదిగ్బంధంలో చిక్కుకుంది. కొడాలి వద్ద ప్రధాన రహదారిపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సీహెచ్.వి.నాగమణి జేసీబీ, కార్మికుల సహాయంతో చెట్లను తొలగించారు.

దేవరకోటలో ఏరువాక



దేవరకోట(ఘంటసాల): మండలంలోని దేవకోట గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల మాట్లాడారు. దేవరకోట గ్రామ రైతు రత్నగిరి పొలంలో ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగలితో పొలం దున్ని, వరి విత్తనాలు చల్లారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులు సన్మానాలు నిర్వహించారు. బదిలీపై వెళుతున్న ఏవో మురళీకృష్ణను ఎమ్మెల్యే సన్మానించారు. సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్లు తోట కనకదుర్గ, కొల్లూరి వెంకటేశ్వరరావు, యువనేత మండలి రాజా, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు, ఏవో కె.మురళీ కృష్ణ, డాక్టర్ అనిత, శాస్త్రవేత్తలు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజా అంకినీడు ప్రసాద్ బహదూర్‌కు నివాళి



బహదూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవరపల్లి సురేష్‌బాబు

చల్లపల్లి: జమిందారీ వంశంలో పుట్టినప్పటికీ అధికారాన్ని, సంపదనూ సమాజ సేవకు, అభివృద్ధికి వినియోగించిన యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహదూర్ చరిత్రలో నిలిచిపోతారని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. చల్లపల్లి రాజా రెండవ కుమారుడు, పార్లమెంటు మాజీ సభ్యుడు అంకినీడు ప్రసాద్ బహదూర్ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. కాగా బుధవారం స్థానిక ఎస్సార్‌వైఎస్పీ కళాశాలలోని అంకినీడు ప్రసాద్ చిత్రపటానికి సురేష్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు జమిందారీ వ్యవస్థ, ఇటు ప్రజాస్వామ్య వ్యవస్థ రెండింటిలోనూ ప్రజలకు సేవ చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. దేవాలయాల అభివృద్ధితో పాటు సమాజ సేవలో, విద్యాభివృద్ధిలో తనకంటూ చెరగని ముద్రవేసుకున్నారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించేలా విద్యాలయాలను, సాంస్కృతిక కట్టడాలను కాపాడుకోవాలని ఆకాంక్షించారు. సురేష్‌తో పాటు మట్టా రాజు, కోటేశ్వరరావు, అంజయ్య ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని రాజకీయాలకు వాడటం తగదు

వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి

అవనిగడ్డ: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం తగదని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు జరిపిన డిబేట్‌లో ఎస్సీలు అనే పదం ఎక్కడా రాలేదని, అయినా ఈ ఘటనలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఘటనలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ పెట్టడం ద్వారా వేశ్యలు అనే పదాన్ని ఎస్సీలకు ఆపాదించేలా ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రజల్లో చులకన అయ్యేలా కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి ముందు నుంచీ ఎస్సీలంటే చులకన భావన ఉందన్నారు. ఎస్సీల్లో ఎవరు పుట్టాలని కోరుకుంటారని గతంలో చంద్రబాబు పేర్కొన్న విషయాన్ని నలుకుర్తి గుర్తు చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎస్సీలను గౌరవించేలా నడుచుకోవాలని హితవు పలికారు.

అదనపు తరగతి గదులను ప్రారంభించిన దాతలు



భట్ట హైమావతి, భానుప్రకాష్‌లను సన్మానిస్తున్న ఎంఈవో- 2 హరనాథ్ తదితరులు

పెడన: పట్టణంలోని తోటమూలలో ఉన్న భట్ట మోహనరావు, హైమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులను బుధవారం ప్రారంభించారు. స్థల దాత దివంగత భట్ట మోహనరావు జ్ఞాపకార్థం సతీమణి భట్ట హైమావతి, వీరి కుమారుడు భాను ప్రకాష్‌లు రూ.12 లక్షల వ్యయంతో పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదులను నిర్మించారు. జెడ్పీసీఈవో అనుమతితో నిర్మించిన వీటిని హైమావతి, భానుప్రకాష్ ప్రారంభించారు. 70 సెంట్ల స్థలాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొరకు దానం చేయడమే కాకుండా పాఠశాలలో రూ.12 లక్షలు పెట్టి అదనపు తరగతి గదులను కూడా నిర్మించి ఇచ్చారని ఎంఈవో- 2 వైవీ హరనాథ్ అన్నారు. ఈ సందర్భంగా వారిని పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మట్టా రాధకృష్ణమూర్తి, హెచ్‌ఎం.సీహెచ్ నాగేశ్వరరావు, భట్ట మోహనరావు కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెలరేగిన మట్టి మాఫియా



పర్రచివర శివారులో సోమవారం రాత్రి టిప్పర్లను అడ్డుకుని ఫొటోలు తీస్తున్న వీఆర్వో



రాత్రి వేళల్లో దూసుకుపోతున్న మట్టి టిప్పర్లు

- రెవెన్యూ, పోలీసుల ఆదేశాలు బేఖాతర్
- కూటమి నేతల అనుమతి ఉందంటూ ప్రచారం
- శృతిమించుతున్న మట్టి, ఇసుక దందా

నాగాయలంక: మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రెవెన్యూ, పోలీసు వర్గాలను ఖాతరు చేయకుండా నిర్భయంగా ముందుకు దూసుకుతోంది.

అనుమతులున్నాయంటూ..

కూటమి నేతల నుంచి తమకు అనుమతులు ఉన్నాయని బాహాటంగా ప్రకటించుకోవడం మరింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అందుకే ధీమాగా అక్రమ తరలింపులు కొనసాగుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

గత కొన్ని రోజులుగా..

గత కొన్ని రోజులుగా నాగాయలంక మండలంలోని పలు తీర గ్రామ ప్రాంతాల్లో మట్టి, ఇసుక తవ్వకాల దందా శ్రుతి మించిపోయింది. సోమవారం రాత్రి అధికారులు దిండి వద్ద మట్టి టిప్పర్లను అడ్డుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని కోరితే వినకుండా అక్కడే అన్‌లోడ్ చేసేసి రాత్రికి రాత్రే ఉడాయించడం చర్చనీయాంశమైంది. తిరిగి మంగళవారం సాయంత్రం ఆరు గంటల నుంచే మట్టి తరలింపు యథావిధిగా కొనసాగింది.

ఈ ప్రాంతాల్లోనే..

రాత్రి వేళల్లో విచ్చలవిడిగా తీర ప్రాంత గ్రామాలైన గణపేశ్వరం, బిల్లీగ్రాహంనగర్ నుంచి మట్టి కొల్లగొట్టి తరలించుకు పోతుంటే అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ ఎస్ఐని అభినందించిన ఎస్పీ



ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వరరావుకు రివార్డును అందజేస్తున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు

కోనేరుసెంటర్: మచిలీపట్నం ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వెంకటేశ్వ రరావును జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పందన హాలులో జరిగిన జిల్లా నేరసమీక్షా సమావేశంలో ఎస్పీ పాల్గొన్నారు. మచిలీపట్నంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడి జరిమానాలను 1,927 మంది వాహనదారుల నుంచి ఎస్ఐ వెంకటేశ్వరరావు సుమారు రూ.32 లక్షల నగదును వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. దీంతో ఎస్పీ ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వరరావును అభినందించి నగదు రివార్డును అందించారు.

పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం ప్రారంభం

ఘంటసాలపాలెం(ఘంటసాల): మండలంలోని ఘంటసాలపాలెం పీహెచ్‌సీ ప్రాంగణంలో జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ దోనే రజని, వెంకటేశ్వరరావు దంపతులు ఎమ్మెల్యేను సత్కరించగా, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఎమ్మెల్యేను సత్కరించారు. తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, డాక్టర్లు యు.నిఖిత ప్రసాద్, పి.రేణుప్రియాంక, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.